క్లుప్తంగా

టిప్పర్, జేసీబీ పట్టివేత



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. సోమవారం రాత్రి నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపట్టిన జేసీబీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. టిప్పర్ యాజమాని, ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

బీజేపీకి ఇద్దరి రాజీనామా

కమలాపూర్: మండలంలోని కన్నూరుకు చెందిన బీజేపీ మండల కార్యదర్శి కిన్నెర సంతోష్, సీనియర్ నాయకుడు పెరుక కొమురయ్య పార్టీ సభ్యత్వంతో పాటు పదవులకు రాజీనామా చేసినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా తాము బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశామని, హుజూరాబాద్ ఉప ఎన్నికల నుంచి మండల, జిల్లా నాయకత్వం పార్టీ సిద్ధంతాలను ఉల్లంఘిస్తుందని ఆరోపించారు. దీంతో రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

బీఎస్పీ నిర్ణయం హర్షణీయం

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాళ్లపల్లి వెంకటస్వామిని ప్రకటించడం హర్షించదగిన విషయమని ఆపార్టీ మండల అధ్యక్షుడు కొయ్యడ మహేష్ తెలిపారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఆయన సూచించారు. జనగామ జిల్లా మహిళా కన్వీనర్ గంగారపు రజిని, నాయకులు చిరంజీవి, మహేష్, కరుణాకర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు: బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో వివిధ కారణాలతో మృతి చెందిన పలు కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, సర్పంచ్ మాదాసి అన్నపూర్ణ రాజు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకం



ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులో కొలువైన నవ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అర్చకులు పంచామృతాలతో మంగళవారం విశేష అభిషేకం చేశారు. తపో భూమిగా విరాజిల్లుతున్న నవ నాగ క్షేత్రం రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన దేవాలయంగా పేరుగాంచిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి అభిషేక ద్రవ్యాలను శోభాయాత్రగా తీసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పవన్ శర్మ మాట్లాడుతూ.. కార్తీక మాసంలో సుబ్రహ్మణ్య దీక్ష మాలధారణ చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 03వ తేదీన సర్ప దోషాలకు ప్రత్యేక పరిహారం అశ్లేషబలి 108 మంది వేదమూర్తులైన బ్రాహ్మణోత్తములకు సత్కారం, కార్తీక మాస వన సమారాధన (వనభోజనం) చేపట్టనున్నట్లు వెల్లడించారు.

మండల కమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని కల్లుగీత కార్మికుల సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం కల్లు గీత కార్మికులు నూతన కమిటీ ఎన్నికైంది. మండల గౌరవ అధ్యక్షుడిగా పెరుమాండ్ల చేరాలు గౌడ్, అధ్యక్షుడిగా తడుక కుమారస్వామిగౌడ్, ఉపాధ్యక్షులుగా బండి రాములుగౌడ్, న్యాతి గోవర్ధన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అల్లం శ్రీధర్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా గట్టు రమేష్‌గౌడ్, తాటికొండ శ్రీకాంత్‌గౌడ్, బొడిగె కొమురయ్య గౌడ్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ముక్కెర మొగిలిగౌడ్, తడుక శ్రీనివాస్‌గౌడ్, కూనూరు రాజుగౌడ్, సలహాదారులుగా బొనగాని రాజేష్‌గౌడ్, మాచర్ల బాలకిషన్‌గౌడ్, కోశాధికారులుగా బండి చేరాలుగౌడ్, వలుగుల రమేష్‌గౌడ్, తడుక సదానందంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రేవూరికి మద్దతు తెలిపిన నాయకులు

ఆత్మకూరు : మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మద్దతు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని అతని నివాసంలో కలిసిన నాయకులు, కార్యకర్తలు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

యువతకు స్ఫూర్తి వల్లభాయ్ పటేల్

- ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'పటేల్' జయంతి



పరకాల : అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల: స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాలను ఏకం చేసి భారతదేశ నిర్మాణానికి కృషిచేసిన గొప్ప మహనీయుడు, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ యువతకు స్ఫూర్తి అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ విభాగం, రాజనీతి శాస్త్రం, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేశ ఐక్యతలో విద్యార్థులు, అధ్యాపకులు పాత్రను గుర్తు చేస్తు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సమరయోధుడిగా, భారత రాజ్యాంగ రచన కమిటీ సభ్యుడుగా వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, డాక్టర్ జి.ఓదేలు, ఎం.రవికుమార్, డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ వి.రాజయ్య, అశోక్‌మోరె, ఎ.అనిల్‌కుమార్, సి.హెచ్ సుస్మిత, రాజశ్రీ, దుప్పటి సంజయ్, జి.స్వప్న, ఎం.డీ రఫీ, శ్రీనివాస్, టి.రాజు, సుమలత పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.డీ సర్దార్ అధ్యక్షతన నిర్వహించగా విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ప్రసంగించి పలుసూచనలు చేశారు.

కమలాపూర్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అధ్యాపకులు, సిబ్బంది ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, అధ్యాపకులు పుష్పలత, కవిత, శ్రీదేవి, సురేష్‌బాబు, రాందాసు, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, మల్లయ్య, సిబ్బంది కొండయ్య, శ్రీనివాస్, కరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో..

గరంగరంగా సర్వసభ్య సమావేశం



వేదిక ఎదుట బైఠాయించిన రవీందర్‌గౌడ్

ఆత్మకూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సుమలత అధ్యక్షతన ప్రారంభమైన సర్వసభ్య సమావేశం గరంగరంగా కొనసాగింది. గ్రామాల్లో ఇంటింటికి నల్లాలు రావడంలేదని అధికారులు స్పందించడం లేదంటూ ఎంపీపీ ఫైర్ అయ్యారు. మండల కేంద్రంలో ఇళ్లు కోల్పోయిన లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణానికి డబ్బులు చెల్లించకుండా కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీపీ వేదిక ఎదుట బైఠాయించారు. కలెక్టర్‌తో మాట్లాడి బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు. గృహలక్ష్మి పథకంలో తమ పేరు వచ్చిందని తెలిసిన లబ్ధిదారులు నూతన ఇళ్ల నిర్మాణం కోసం ఇళ్లు కూల్చుకున్నారని వారి పరిస్థితి ఏంటని అధికారులను సర్పంచ్ పర్వతగిరి రాజు ప్రశ్నించారు. సమావేశం మధ్యలో తిరుమలగిరి సర్పంచ్ మనోహర్‌కు పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, ఎంపీపీ సుమలత భర్త రజనీకర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమావేశానికి పూర్తిస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కాలేదు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిచాలన్నారు. వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు వరుణ్‌గాంధీ, ఇందిర, రజనీకర్‌రెడ్డి, సర్పంచ్‌లు మనోహర్, యాదగిరి, రాజు ఏఈలు రవికుమార్, లత, సతీష్, పశువైద్యాధికారి డాక్టర్ ధర్మానాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



ఓటరు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్

నడికూడ: పౌరులకు ఆయుధంగా నిలిచే ఓటుహక్కును ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో పరకాల పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు సమన్వయంతో ఉండాలని సూచించారు. ఘర్షణలకు తావు లేకుండా సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ వెంకటరత్నం, ఎస్సై శివకృష్ణ, పోలీస్ సిబ్బంది, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటును నమ్ముకోవాలని.. అమ్ముకోవద్దు

శాయంపేట : పౌరులకు వజ్రాయుధంగా నిలిచే ఓటుహక్కును ప్రతిఒక్కరూ స్వాతంత్య్రంగా వినియోగించుకోవాలని బీఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఓటు అమ్మబోకు బానిసగా మారబోకు కరపత్రాన్ని గోవిందాపూర్ గ్రామంలో మంగళవారం పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. పవిత్రమైన ఓటుహక్కును కరెన్సీ నోటు, మద్యం బాటిల్, బిర్యాని ప్యాకెట్లకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రజల కోసం పనిచేసే, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

'చలివాగు' గండిని వెంటనే పూడ్చివేయాలి



ఆయకట్టు కాల్వ గండిని పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : చలివాగు ప్రాజెక్టు ఆయకట్టు గండికి నీటిపారుదలశాఖ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి పూడ్చివేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని జోగంపల్లి గ్రామ శివారులోని చలివాగు ప్రాజెక్టు ఆయకట్టు కాల్వను ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలివాగు ఆయకట్టు కాల్వకు గండి పడి పదిరోజులు అవుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం హేయమైన చర్య అన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించేందుకు కృషి చేయలేదని ఆరోపించారు. చలివాగు ప్రాజెక్టు క్రింద సుమారుగా 4వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ప్రస్తుతం వరిపంట పొట్ట దశలో ఉండి నీరు అధిక మొత్తంలో తీసుకుంటుందని అన్నారు. ప్రస్తుతం పంటకు నీరు అందించకుంటే రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే గండిని పూడ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

జోరందుకున్న చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో చేరారు. దోమల వీరన్న, స్వామిశెట్టి రాజు, బూర రాజకుమార్, బొత్త రాజయ్య, ఆకుతోట రమేష్, చలిక చిరంజీవి, ఎండీ చోటు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమణారెడ్డి

మండల కేంద్రానికి చెందిన 20మంది బుడిగ జంగాల కులస్తులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తూర్పాటి రాజయ్య, సునిత, సదయ్య, లక్ష్మి, పెద్దరాజయ్య, రాజమ్మ, శంకర్, భాగ్యమ్మ, గోవింద్, సరోజన, ఉప్పలయ్య, ఎల్లమ్మ, రాజకుమార్ చేరగా వారికి ఎమ్మెల్యే రమణారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలుపు ఖాయం



పరకాల : మట్లాడుతున్న శ్రీను

పరకాల : / ఆత్మకూరు : ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, బీఆర్ఎస్‌వీ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి అర్షం మధుకర్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని 38,41,44,45వ బూత్ కమిటీల సన్నాహక సమావేశాన్ని మంగళవారం శ్రీను నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు చేపట్టాల్సిన చర్యపై చర్చించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిపిన ధర్మారెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు సోదా రామకృష్ణ, పావుశెట్టి వెంకటేశ్వర్లు, నిప్పాని సత్యనారాయణ, చందుపట్ల రమణారెడ్డి , కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



కమలాపూర్ : ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రణవ్



శాయంపేటలో..



ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, వెంకటేష్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

కమలాపూర్: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఇందిరాగాంధీ 39వ వర్ధంతి నిర్వహించగా ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ అభ్యున్నతి కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. మండల అధ్యక్షుడు చరణ్‌పటేల్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు సునీత, హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలయ్యగౌడ్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు హనుమాన్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు రవీందర్, రమేష్‌గౌడ్, విష్ణుదాసు వంశీధర్‌రావు, రమేష్, కృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

శాయంపేట : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిందం రవి, తడుక కుమారస్వామి, రఫీ, రాజేందర్, కట్టయ్య, రాజు, మార్కండేయ, రాజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎల్కతుర్తి: మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వరికోతలు మొదలై పక్షంరోజులు గడుస్తున్నా ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. వాతావరణంలో రోజురోజుకు చోటుచేసుకుంటున్న మార్పులతో వర్షాలు కురిస్తే చేతికందిన ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో కురిసిన వర్షాలతో ధాన్యం తడిసి కొంతమేర నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కామెర వెంకటరమణ, మనోహర్, మొండయ్య, సిరాజ్, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నడికూడ: మండల కేంద్రానికి చెందిన తాళ్ల మల్లయ్య సోమవారం మృతి చెందగా మంగళవారం సర్పంచ్ ఊర రవీందర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు కొంత మేరకు కొంత ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిన్నెర మణి పాల్గొన్నారు.

బీసీ బిడ్డకే పరకాల ఎమ్మెల్యే టికెట్

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



వేదికపై ఐక్యతను చాటుతున్న నాయకులు

పరకాల: నియోజకర్గం నుంచి బీజేపీ తరపున ఎమ్మెల్యే బరిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థినే ఉంటాడని, ప్రజల ఆశీర్వాదం ఉండాలని బీజేపీ నాయకుడు, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి బరిలో ఉన్న రెడ్డి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులకు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన బీసీ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, డాక్టర్ కాళీప్రసాద్‌రావు, దేవు సాంబయ్య, మంద ఐలయ్యతో కలిసి హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల గడ్డ బీసీ అడ్డా అని నిరూపించాలన్నారు. గొర్రెలు, బర్రెలు కాకుండా ముఖ్యమంత్రి సీటు బీసీలకు ఇచ్చే దమ్ము ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికే నియోజకవర్గ ప్రజలు ధర్మారెడ్డిని నమ్ముకొని మోసపోగా..మరో రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి రాబోతున్నాడని వారికి పదవులే ముఖ్యమని, ప్రజల సమస్యలు పట్టవన్నారు. అలాంటి అభ్యర్థులకు బీసీలంతా ఒకేతాటిపై నిలబడి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. డబ్బుతో ఓట్లు కొనే విషసంస్కృతి చల్లా ధర్మారెడ్డికే చెల్లుతుందన్నారు. అందుకే ఆయనను ఓడించి బీసీల ఐక్యతా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి కొలనుపాక భద్రయ్య, గోదా చిన్న, తీగల భరత్, కుక్కల విజయ్, ఆకుల రాంబాబు, కక్కు రాజు, బీసీ సంఘాల నాయకులు పిట్ట వీరస్వామి, జంగేటి సారంగపాణి, దాస లింగయ్య, ముల్కనూరు రాములు, వెలకంటి శ్రీనివాస్, ముస్కే సంతోష్, సింగవేణి రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

ఐనవోలు: అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి కోరారు. మండలంలోని గర్మిళ్లపల్లిలో ఆ పార్టీ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఏర్పాటు చేయగా శ్రీహరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట గ్రామ శివారు నుంచి సెంటర్ వరకు ప్రచార రథంలో ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని గమనించాలన్నారు. తాను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 12 ఎకరాల భూమి సేకరించి ఇంటి జాగాలు, 300 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి గర్మిళ్లపల్లి గ్రామస్తులకు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు అధికారంపై యావ తప్ప ప్రజలకు సేవ చేయాలనే సోయి లేదని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, దళితబంధు, బీసీ బంధు తదితర పథకాలను నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, సర్పంచ్ గండి మల్లికాంబ, మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



ఐనవోలు: ఈనెల 18వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సమావేశం బరిగల వెంకటస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం ఏబీసీడీగా వర్గీకరణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కట్కూరి రమేష్, సింగారపు చంద్రమౌళి, చింటుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఐనవోలు: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఐనవోలు, కొండపర్తి, వనమాల కనపర్తి, కక్కిరాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ జరిగే రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్సై వంగాల నవీన్‌కుమార్‌కు వివరించారు. ప్రొహిబిషన్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.